

బీచ్‌రాజ్‌పల్లి జర్పులతండాలోని ఓ రైతు మిరపతోట కోతకు గురవ్వడంతో వాగును తలపిస్తున్న భూమి

# కదిలిస్తే.. కన్నీరే.!

## ముంపు బాధితుల పరిస్థితి దయనీయం

- పది రోజులైనా అందని ప్రభుత్వ సాయం
- భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన పలు కుటుంబాలు
- మరిపెడ మండల వ్యాప్తంగా రూ.కోట్లల్లో నష్టం
- రాష్ట్ర సర్కార్‌కు నివేదికలు పంపిన అధికారులు



సీతారాంతండాలో తడిసిన వడ్లను ఎండబెట్టిన బాధిత కుటుంబం

మరిపెడ, సెప్టెంబరు 11 : ఇటీవల కురిసిన వర్ష ప్రభావానికి గురైన ముంపు బాధితుల పరిస్థితి ఇంకా దయనీయంగానే ఉంది. పది రోజులైనా ప్రభుత్వ సాయం అందలే. ఎవరిని కదిలించినా వారికంట కన్నీరే ఉబికివస్తోంది. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో బాధిత కుటుంబాలు బిక్కుబిక్కుమంటున్నారు. అధికారులు నష్టం అంచనా లెక్కలతోనే సరిపుచ్చుతున్నారని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. ఉప్పెనలా వచ్చిన వరదఉధృతితో మరిపెడ మండలంలోని ఉల్లెపల్లి, సీతారాంతండా పూర్తిగా, బాల్నిధర్మారంలోని కొన్ని కుటుంబాలు వరద ముంపుతో సర్వం కోల్పోయాయి. కట్టుబట్టలతో మిగిలిఉన్న ఆ కుటుంబాలు ప్రభుత్వ సాయం కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నాయి.

పది రోజుల క్రితం ఉప్పెనలా వచ్చిన వరద ఆ మూడు గ్రామాలతో పాటు మరిపెడ మండలాన్ని మొత్తం అతలాకుతలం చేయగా రూ.కోట్లల్లో నష్టం వాటిల్లింది. అధికారులు నష్ట అంచనాలను గత పది రోజులుగా లెక్కలేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సీతారాంతండా బాధిత కుటుంబాలను పరామర్శించి పదిరోజులు గడిచినప్పటికీ ఇప్పటి వరకు బాధిత కుటుంబాలకు నయా పైసా అందలేదు. స్వచ్ఛంద సంస్థలు, దాతృత్వం కలిగిన కొందరు ఉడుతాభక్తిగా కొంతలో కొంత నిత్యావసర సరకులు అందించినప్పటికీ వారి ఆకలి తీర్చలేకపోతున్నారు. ఓ వైపు పంటలు మునిగి, భూమి కోతకు గురైన రైతన్నల ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. ముంపుతో ఇళ్లల్లోనే తడిసిన ఆహార ధాన్యాలను ఆరబెట్టుకుంటున్నారు. మరికొందరు వాసనపట్టడంతో వాటిని ఆకేరు నీటిలోనే వదిలేశారు.

బీచ్‌రాజ్‌పల్లిలోని ఓరైస్ మిల్లులో 5టన్నుల బియ్యం నిల్వ ఉండగా వరద ముంపుతో అవి పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. పంట పొలాలు నష్టపోయి, పశువులు కొట్టుకపోయి, కరెంట్ మోటార్లు వరదకుగల్లంతై, పొలాలు కోతకు గురైనోళ్లు నిత్యం కన్నీటి పర్యాంతం చెందుతున్నారు. మరిపెడ మండల వ్యాప్తంగా ఆయాశాఖల అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్ని పం టలు కలిపి మొత్తం 5,600 ఎకరాల్లో రైతులు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఉల్లెపల్లిలో 123 ఇళ్లు, సీతారాంతండాలో 49 ఇళ్లు, బాల్నిధర్మారం, తండాధర్మారంలో 10 ఇళ్ల చొప్పున నీట మునిగి ప్రజలు సరస్వం కోల్పోయారు. అదే విధంగా 36 పశువులు, 69 గొర్రెలు, 58 మేకలు ఆకేరు వరద ఉధృతిలో కొట్టుకపోయాయి. మండలంలోని 44 జీపీలలో ఇంకా 178 ఇళ్లకు నష్టం వాటిల్లింది. 107 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 480 కరెంట్ స్తంభాలు దెబ్బతిన్నాయి. 30 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్లు, 5కిలోమీటర్ల పరిధిలోని పీఆర్‌రోడ్లు పాడైనట్లు ఆయా శాఖల అధికారులు నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. మరిపెడ మండలంలోని చిల్లంచర్ల, వీరారం, బీచ్‌రాజ్‌పల్లి ఆనేపురం, ఎడ్జర్ల, నీలికుర్తి, ఉల్లెపల్లిలోని చెరువులు, కుంటలు కలిపి 20 దాకా తెగిపోయాయి. వీటికి అధికారులు నష్ట అంచనాలను తయారు చేస్తున్నారు. ఉల్లెపల్లి, భూక్యాతండా, బీచ్‌రాజ్‌పల్లి, ఎడ్జర్ల, తండాధర్మారం, పీఎస్‌గూడెం, బాల్నిధర్మారంలోని రైతులకు చెందిన వందలాది మోటర్లు, పైపులు ఆకేరులో గల్లంతు అ య్యాయి. చెరువు లు, కుంటలకు గండ్లు పడడంతో పంట పొలాలు కోతకు గురై వాగులను తలపిస్తున్నా యి. లక్షలు వెచ్చించిన పంట పొలాలు చేతికి వచ్చేదెట్లా అంటూ రైతులు తలలు పట్టుకొని రోదిస్తున్నా రు. తమకు జరిగిన నష్టం కొండంతైతే ప్రభుత్వం ఉడతభక్తి సాయం చేస్తే తమ పరిస్థితిపై అగమ్యగోచరమేనని రెతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



### భూములు చేతికొచ్చేదెట్లా..?

జర్పుల శాంతమ్మ, జర్పులతండా, బీచ్‌రాజ్‌పల్లి

మాకున్న నాలుగెకరాల చెలకలో బీచ్‌రాజ్‌పల్లి చెరువుకు గండిపడడంతో ఇసుక దిబ్బలు మేట పెట్టి వాగును తలపిస్తోంది. లక్షలు పోసిన భూమి చేతికొచ్చేదెట్లనో తెలియడం లేదు. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇస్తమంటోంది కానీ అవి ఏమాత్రం సరిపోవు.



### సర్వం కోల్పోయాం..

- గుగులోత్ కాళి, సీతారాంతండా

ఆకేరు వరద ఉధృతికి ఇళ్లన్నీ మునిగి, తండా వాసులం సర్వం కోల్పోయాం. కట్టుబట్టలతోనే మిగిలిపోయాం. సీఎం రేవంత్‌రెడ్డి ఆదుకుంటామన్నారు. ఇళ్లల్లోని ఆహార ధాన్యాలన్నీ తడిసిపోయాయి. పలువురు దాతలు తండాకు వచ్చి బియ్యం, నిత్యవసర సరకులు సహాయం చేస్తున్నారు. రెండెకరాల పొలం మునిగి ఇసకమేట పెట్టింది. మా బతుకులు ఎలా బయటపడతాయో తెలియడం లేదు.



బీచ్‌రాజ్‌పల్లిలోని ఓ రైస్ మిల్లులో తడిసిన 5 టన్నుల బియ్యాన్ని ఎండబెడుతున్న మిల్లు సిబ్బంది



మరిపెడ మండలం పీఎస్ గూడెం వద్ద తెగిన హైవే రోడ్డు (ఫైల్)



సీతారాంతండాలో నీట మునిగిన ఇంటి యజమాని ఇస్లావత్ మంగీలాల్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కేంద్రబృందం సభ్యులు

# గోడును వింటూ.. నష్టాన్ని పరిశీలిస్తూ..

## మరిపెడ, డోర్నకల్ మండలాల్లో కేంద్రబృందం పర్యటన

- రాత్రైనా గంటల పాటు పరిశీలన
- సభ్యులు ముందు బోరున విలపించిన బాధితులు
- వరదతో జరిగిన నష్టాన్ని చూసి చలించిపోయిన అధికారులు

మరిపెడ, సెప్టెంబరు11 : మరిపెడ మండలంలో కేంద్రబృందాలు పర్యటించాయి. గత పదిరోజుల క్రితం భారీ వర్షాలకు వరదముంపునకు గురై.. నష్టపోయిన పంటపొలాలను, జలదిగ్బంధానికి గురైన ఇళ్లను, తెగినరోడ్లను, కుంటలు, చెరువులను ఆరుగురు సభ్యులు ఉన్న కేంద్రబృందం రెండుగా విడిపోయి.. క్షుణ్ణంగా బుధవారం రాత్రి పరిశీలించారు. బుధవారం రాత్రి 6.30 నిమిషాలకు ఖమ్మం జిల్లా పర్యటన ముగించుకుని మరిపెడ విశ్రాంతి భవనానికి కేంద్రబృందాలు చేరుకోగా, వారికి జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మొక్కను అందించి, స్వాగతం పలికారు.

తొలుత మరిపెడ మండలం ఉల్లేపల్లిలో జలదిగ్బంధానికి గురైన ఇళ్ల బాధితుల వద్దకు వెళ్లి వారికి జరిగిన నష్టాన్ని పరిశీలిస్తూ, బాధితులు చెప్పిన అన్ని విషయాలను వింటూ.. సహాయక చర్యలపై కేంద్రబృందం ఆరా తీసింది. గ్రామానికి చెందిన ఉల్లోజు భిక్షం ఇంటి ప్రహరీ వరద తాకిడికి గురికాగా, దానిని పరిశీలించారు. మరో పక్క అక్కడి రైతు బంటు ఎల్లయ్య కేంద్ర బృందానికి తనకు జరిగిన నష్టాన్ని ఎకరువు పెట్టారు. 'నా ఇళ్లు మునిగింది. నా.. పొలం కొట్టుకుపోయింది. నా పశువులు, మేకలు, గొర్రెలు, విద్యుత్ మోటారు సైతం కొట్టుకుపోయాయని' బృందం సభ్యుల ముందు బోరున విలపించాడు. అనంతరం ఉల్లేపల్లిలో వరదఉధృతి, జరిగిన నష్టంపై అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. కేంద్ర బృందానికి బీచరాజుపల్లి రైతులు పంటనష్టంపై ప్లకార్డులను చిమ్మ చీకట్లో ప్రదర్శిస్తూ, తమ గోడును వెల్లబుచ్చారు. సీతారాంతండాలో కేంద్ర బృందం పర్యటించగా.. అక్కడ జలదిగ్బంధానికి గురైన ఇళ్లను చూసి అవక్కయ్యారు. ఇస్లావత్ మంగీలాల్-కవిత దంపతులతో మాట్లాడి ఆ కుటుంబానికి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. అర్ధరాత్రి 3గంటల ప్రాంతంలో తమ ఇల్లు జలదిగ్బంధంలో చిక్కుకోగా సర్వస్వం కోల్పోయి తాము కట్టుబట్టలతో మిగిలిపోయామని రోదిస్తూ కేంద్ర బృందం ముందు వాపోయారు.

ఆరో తరగతి చదువుతున్న వారి కుమారుడు వీరభద్రం తన పుస్తకాలు, నోట్ బుక్స్ వరదలో కొట్టుకుపోయాయని తెలుపగా, వారు బాలుడి మాటలు విని


మిగతా 8వ పేజీలో..




ముల్కలపల్లి వద్ద ఆకేరు వరదకు కూలిపోయిన హైలెవల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న కేంద్రబృందం

### ఎత్తయిన ప్రదేశంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- కేంద్ర బృందానికి ముల్కలపల్లి వాసుల మొర


వివరాలు 8లో..




# రోడ్డు పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




వంతెనపైకి ఎక్కుతున్న విద్యార్థులు

చిన్నగూడూరు, సెప్టెంబరు 11 : మండలంలోని ఆకేరువాగు వద్ద భారీ వర్షాలకు వచ్చిన వరద తీవ్రతకు కొట్టుకుపోయిన ఆర్అండ్‌బీ రోడ్డుకు మోక్షం లభించింది. 12 రోజులుగా ప్రజలు, విద్యార్థులు తీవ్రఅవస్థలు ఎదుర్కొన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బడికి పోవాలంటే నిచ్చెన దిగాల్సిందే' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. దీంతో బుధవారం కొట్టుకుపోయిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. వాహనదారులు, విద్యార్థులు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు.

# 17న ప్రజాపాలన దినోత్సవం

## మానుకోటలో జాతీయ జెండాను ఎగురవేయనున్న ప్రభుత్వవిప్



మహబూబాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో సెప్టెంబర్ 17న 'ప్రజాపాలన' దినోత్సవాన్ని నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాజధాని హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో జాతీయజెండాలను ఎగురవేయా లని నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జెండాను ఎగురవేయనున్నారు. మిగతా 32జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండాలను ఎగురవేసేందుకు ముఖ్యఅతిథులుగా మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రభుత్వ విప్‌లు, కార్పొరేషన్ ఛైర్మన్‌లను నియమించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ జాటోతు రాంచందర్‌నాయక్ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగురవేయనున్నారు.

# వీసీ నియామకమెన్నడో?



- కాళోజీ హెల్త్‌వర్సిటీకి వైస్ చాన్సలర్ భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం
- పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించి.. మరిచిపోయిన వైద్యశాఖ
- 35 మంది నుంచి అందిన దరఖాస్తులు
- రెండు నెలలు గడిచినా పరిశీలించని కమిటీ
- మూడు పేర్లని సీఎంకు పంపే ప్రక్రియను మరిచిన వైనం
- నిబంధనలకు విరుద్ధంగా పదేళ్లుగా వీసీ బాధ్యతల్లో ఒకే వ్యక్తి
- గత ప్రభుత్వంతో ఉన్న సాన్నిహిత్యంతోనే కొనసాగింపని ప్రచారం
- పలు అవకతవకలకు వర్సిటీ నిలయంగా మారిందని ఆరోపణలు


వివరాలు 7లో..


కీలక పోస్టుల్లో రిటైర్డు ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగించడం.. పీజీ పరీక్షల ఫలితాల్లో అవకతవకలు.. వరంగల్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెంపు.. నర్సింగ్ కోర్సు నిర్వహణలో విఫలం.. తదితర ఆరోపణలు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ కీర్తిప్రతిష్టలకు మాయని మచ్చల్లా మిగిలాయి. వీటంతటికీ పదేళ్లుగా ఒకే వ్యక్తి వీసీగా కొనసాగడమే కారణమని.. త్వరలోనే ఆ స్థానంలో కొత్త వ్యక్తిని నియమిస్తారన్న ప్రచారం జరిగింది. అందుకు అనుగుణంగా వైద్యశాఖ ఈ ఏడాది జూన్‌లో అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా 35మంది దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ఇక కొత్త వీసీ వస్తారు.. వర్సిటీ పరిస్థితి మారుతుందని అంతా భావించారు. కానీ ఎడతెగని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలైనా వాటిని కమిటీ పరిశీలించకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తప్ప వీసీ నియామకం అంశంలో అడుగులు ముందుకు పడవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి, వరంగల్ ప్రతినిధి

# వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలి

## ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్‌లో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే నిజాం చెరువును పరిశీలిస్తున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 11 : జిల్లా కేంద్రంలో ఈనెల 16వ తేదీన వినాయకవిగ్రహాలను నిమజ్జనం చేసే భక్తులు, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని నిజాం చెరువును మునిసిపల్ ఛైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ కేంద్రంతో పాటు వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయకవిగ్రహాలను నవరాత్రుల అనంతరం నిజాం చెరువులోనే నిమజ్జనం చేసేందుకు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నిర్వాహకులతో పాటు చిన్నారులు, మహిళలు కూడా నిమజ్జనం చేసేందుకు వస్తారని వారిని చెరువు దగ్గరకు వెళ్లకుండా మునిసిపల్ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ వైస్ ఛైర్మన్ మార్నేని వెంకన్న, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, డీఈ ఉపేందర్, వార్డు కౌన్సిలర్ పోతురాజు రాజు, కో-ఆప్షన్ సభ్యుడు నిమ్మల శ్రీను, ఏఈ కుమార్ ఉన్నారు.

### ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలి..

ఆనందోత్సవాల నడుమ గణపతి నవరాత్రులను జరుపుకోవాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. పట్టణంలోని 24వ వార్డు లెనిన్ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, యూత్ నాయకులు పాల్గొన్నారు.

### బాధితులను ఆదుకుంటాం..

మహబూబాబాద్ రూరల్ : అకాల వర్షంతో నష్టపోయిన రైతులు, బాధితులు ఆదుకుంటామని, ఎవరూ అధైర్య పడొద్దని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మల్యాల, చోక్ల తండ శివారు మెగ్యాతండాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ మల్యాలలో ఆరు పెంకుటిల్లు వర్షానికి కూలిపోవడంతో బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బెల్లిముత్తయ్య అంజిబాబు, శేఖర్, రమణయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి బలం

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు
- సమావేశానికి హాజరు కాని మండల అధ్యక్షులపై అసహనం



సమావేశంలో మాట్లాడుతున్న గరికపాటి మోహన్‌రావు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 11 : కార్యకర్తలే పార్టీకి బలమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. మహబూబాబాద్ బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు సమావేశానికి మండల పార్టీ అధ్యక్షులు, మండల ప్రముఖ్‌లు, సహ ప్రముఖ్‌లు ఎందుకు హాజరు కాలేదని మండిపడ్డారు. రెండేళ్లకోసారి జరిగే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి వ్యక్తిగతంగా ఏమైనా కారణాలు ఉంటే ఉండవచ్చు, కానీ సభ్యత్వ నమోదు సమావేశానికి హాజరు కావాలని సూచించారు. ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని, సభ్యత్వం తీసుకునేందుకు ఉత్సాహంగా ఉన్నారని పేర్కొన్నారు. మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గంలో కలిసి లక్ష సభ్యత్వాలు నమోదు చేయాలని రాష్ట్ర పార్టీ ఆదేశించినట్లు చెప్పారు. ఒక్కొక్క బూత్‌లో 200 సభ్యత్వాలు చేయాలని, టార్గెట్ పెట్టారని పేర్కొన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. గతంలో ఇంటింటికి తిరిగి రసీదులు ఇచ్చేవారమని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని, ఎవరి సెల్‌ఫోన్‌లో వారి సభ్యత్వాన్ని నమోదు చేసుకునే వెసులుబాటు ఉందని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, భాస్కర్‌రెడ్డి, యాప సీతయ్య, భూక్య సంగీత, శశివర్ధన్‌రెడ్డి, క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, మోసంగి మురళి, ధర్మారపు వెంకన్న, సురేందర్, చీకటి మహేష్‌గౌడ్, ఆకుల శ్రీనివాస్, వల్లభు వెంకటేశ్వర్లు, దార ఇందు భారతి, పైండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 18 నుంచి డీఎల్ఈడీ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 24 వరకు జరుగుతాయని డీఈవో డి.వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. సంబంధిత వెబ్ పోర్టల్ నుంచి విద్యార్థులు వారి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించరని, పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# అడహక్ ప్రమోషన్‌లను క్రమబద్ధీకరించాలి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 11: విద్యుత్ సంస్థల్లో టీవోవో- 954, ఎస్‌వోవో- 37 ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ఇటీవల కల్పించిన అడహక్ ప్రమోషన్‌లను ఆర్ఓఆర్ (రూల్ ఆఫ్ రిజర్వేషన్) రూల్స్ ప్రకారం క్రమబద్ధీకరించాలని టీజీ ఎస్పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ జాక్ నాయకుడు డీఈ ఆనందం డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో పాతపద్ధతిని యథావిధిగా అమలు చేయాలని నిరసిస్తూ హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో టీవోవో- 954, ఎస్‌వోవో-35 ఉత్తర్వులు జారీ చేసి పదోన్నతుల్లో మెరిట్ కమ్ సీనియారిటీ అంశానికి తెరలేపి ఎస్సీ, ఎస్టీ పదోన్నతుల్లో రిజర్వేషన్‌లకు అడ్డంకులు సృష్టిస్తూ విద్యుత్‌శాఖలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య పూర్తిగా రాజ్యాంగానికి, రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన జీవోలకు వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అసోసియేషన్ కంపెనీ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఎస్టీ అసోయేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్, ఉద్యోగులు రమేశ్, ప్రభావతి, నర్సింహారావు, దుర్గం మల్లేశం, మొగిలయ్య, నందారాథోడ్, రమేశ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# పులిపిరికి అరుదైన చికిత్స

**▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు**


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 11: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. గురు, శుక్రవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లలోని సంప్రదించాలన్నారు.

# హైకోర్టు తీర్పు ఆధారంగానే కులగణన ప్రారంభించాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 11: హైకోర్టు తీర్పు ఆధారంగానే కులగణన ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ కోరారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్ కాలనీలో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు తమ్మల శోభారాణి, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

# మండలి ప్రతిపక్ష నేతగా సిరికొండ

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 11: మండలి ప్రతిపక్ష నేతగా మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి నియమితులయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. జూలై 25న మండలిలో బీఆర్ఎస్ పక్షనేతగా మధుసూదనాచారిని ఆపార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. ఆయనను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని అసెంబ్లీ కార్యదర్శికి లేఖ అందజేయగా దానిపై బుధవారం ఆమోదముద్రపడింది.

# వీసీ నియామకమెన్నడో?

## కాళోజీ హెల్త్‌వర్సిటీకి వైస్ చాన్స్‌లర్ భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం

## నిబంధనలకు విరుద్ధంగా పదేళ్లుగా వీసీ బాధ్యతల్లో ఒకే వ్యక్తి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పోస్టు భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం ఆవహించింది. కొత్త వీసీ నియామకంపై వైద్యశాఖలో స్పష్టత కరువైంది. వర్సిటీ ఏర్పడిన నాటి నుంచి పదేళ్లుగా ఒకే ఒక వ్యక్తిని వీసీని కొనసాగిస్తుండగా.. కొత్త వీసీ కోసం దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలైనా వాటిని పరిశీలన చేయకపోవడం పట్ల వైద్యశాఖ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుదీర్ఘకాలం పాటు వీసీగా పని చేయడంతో పాటు కీలక పోస్టుల్లో రిటైర్డు ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగించటం, పీజీ పరీక్షల ఫలితాల్లో అవకతవకలు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెంపు, నర్సింగ్ కోర్సు నిర్వహణలో విఫలం తదితర ఆరోపణల నేపథ్యంలో వీసీని తొలగిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే నోటిఫికేషన్ ఇచ్చి కొత్త వీసీని ఎంపిక చేయకపోవటం ఏంటనేది వైద్యశాఖలో చర్చనీయాంశంగా మారింది.

### పదేళ్లుగా ఒకే ఒక్క వైస్‌చాన్స్‌లర్

కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో పదేళ్లుగా ఒకే ఒక్కరు వైస్ చాన్సలర్‌గా కొనసాగుతున్నారు. 2015 సెప్టెంబరు 26న హెల్త్ వైస్‌చాన్సలర్‌గా డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. 31 డిసెంబరు 2019నాటికి ఆయన పదవీకాలం ముగిసింది. అయితే యూనివర్సిటీ నిబంధనల ప్రకారం మరో ఆరు నెలల వరకు కొత్త వీసీ వచ్చేవరకు పదవిలో కొనసాగే అవకాశం ఉంది. ఆ గడువు కూడా ముగిసిపోయింది. సుమారు పది సంవత్సరాలుగా ఒక్కరే వీసీ సీటును వదలటం లేదనే విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వంలోని పెద్దల సహకారంలో సుదీర్ఘ కాలంగా వీసీ కుర్చీలో సెటిల్ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. దేశ చరిత్రలోనే హెల్త్ యూనివర్సిటీకి ఒక్కరే వీసీగా ఇంతకాలం పని చేసిన దాఖాలాలు ఎక్కడ లేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మార్చి 23న అన్ని యూనివర్సిటీలకు వీసీ పదవీకాలం పూర్తి కావటంతో ఐఏఎస్‌లను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించింది. అయితే పదేళ్లుగా వీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీని మాత్రం టచ్ చేయకపోవటం వైద్య ఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది.

### సెర్చ్ కమిటీ పరిశీలించేదెప్పుడో?

కాళోజీ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ పదవీకాలం ఎప్పుడో పూర్తయింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలతో సత్సంబంధాలు ఉండటంతో వీసీని మార్చకుండా కొనసాగించారనే ప్రచారం ఉంది. దీంతో పదేళ్లుగా హెల్త్ వర్సిటీ కుర్చీని వదలకుండా అతుక్కుపోయారనే విమర్శలున్నాయి. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత యూనివర్సిటీల బలోపేతంపై దృష్టిపెట్టింది. అందులో భాగంగా తెలంగాణలో ఉన్న అన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీలను నియమించింది. తాత్కాలికంగా ఐఏఎస్‌లను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించింది. అలాగే కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నియామకం కోసం జూన్ 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించింది. రెండేళ్ల పాటు డీన్‌గా లేదా కనీసం పదేళ్ల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేసి, 67ఏళ్ల లోపు వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ ఆహ్వానించింది. అయితే నోటిఫికేషన్‌లో డీన్‌గా రెండేళ్ల పాటు పని చేసి ఉండాలని సూచించటం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని వైద్యులు వాదించటంతో తొలుత ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవరించి జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులకు ఆహ్వానించారు. వరంగల్‌కు చెందిన పలువురు వైద్యులు కూడా వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే గడువులోపు 35కి పైగా దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. నిబంధనల ప్రకారం ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ వీసీ పోస్టు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంటుంది. దరఖాస్తులు పరిశీలించిన తరువాత ముగ్గురి పేర్లను ప్రభుత్వానికి పంపించాలి. సెర్చ్ కమిటీ పంపిన మూడు పేర్లను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించి తుది పేరును గవర్నర్ ఫైనల్ చేసి వీసీని నియమిస్తారు. అయితే జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు సెర్చ్ కమిటీ వీసీ పోస్టుకు ముగ్గురి పేర్లను ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపించకపోవడానికి కారణాలేంటనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.

స్థానికత అంశంపై కోర్టులో కేసులు ఉండటంతో కొంత ఆలస్యమవుతోంది. వీటితో పాటు బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు కూడా కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కొత్త వీసీ నియామకంపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

### కొత్త వీసీ కోసం వెయిటింగ్..

కాళోజీ హెల్త్ వర్సిటీలో పదేళ్లుగా ఒక్కరే వీసీగా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో విశ్వవిద్యాలయం పాలన గాడి తప్పిందన్న విమర్శలున్నాయి. వీసీ యూనివర్సిటీలో కంటే హైదరాబాద్‌కే ఎక్కువ పరిమితం అవుతున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా గత ప్రభుత్వం వరంగల్ జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759 గజాల స్థలాన్ని (56ఎకరాలు) తాకట్టు పెట్టి వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి కోసం హైదరాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ నుంచి రూ.1,173కోట్ల రుణం తీసుకుంది. ఈ విషయమై ఆగ్రహంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించారు. అయితే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం ఏర్పాటు చేసిన కమిటీలో వీసీ కూడా సభ్యుడిగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. జైలు స్థలం తాకట్టులో కమిటీ సభ్యులు, వైద్యులు, ఆర్అండ్‌బీ అధికారుల పాత్రపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. అలాగే 2022లో పీజీ సీట్ల కేటాయింపుల్లో గోల్‌మాల్ జరిగింది. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. అయితే రెండేళ్లుగా విజిలెన్స్ విచారణను ముందుకు సాగినివ్వటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెగ్యులర్ ఉద్యోగుల నియామకంపై దృష్టిపెట్టకపోవటంతో పాటు తన సన్నిహితులను కాంట్రాక్టు పద్దతిలో ఉద్యోగాల్లో నియమిం చుకున్నారనే ఆరోపణలను వీసీ ఎదుర్కొంటున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ యూనివర్సిటీని పునరావాస కేంద్రంగా మార్చారని, అంతేకాకుండా బీఎస్సీ నర్సింగ్ కోర్సును సక్రమంగా నిర్వహించటంలో వైఫల్యం చెందా రన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో మగవారికి కూడా అవకాశం కల్పించాలని 2007లోనే ప్రభుత్వం ఆదేశించింది.

ప్రస్తుతం ఆడవారికి మాత్రమే నర్సింగ్‌లో అడ్మిషన్లు ఉండగా, మగవారు కూడా నర్సింగ్ కోర్సుపై ఆసక్తితో ఉన్నారు. దీనిపై పలువురు కోర్టుకు వెళ్లినప్పటికి మగవారికి హాస్టల్ వసతి లేదనే సాకుతో ఇన్నాళ్లు ప్రవేశాలు కల్పించటం లేదు. కనీసం డే స్కాలర్‌గానైనా అవకాశమివ్వాలని మగవారు కోరుతున్నా హెల్త్‌వర్సిటీ పట్టించుకోవటం లేదు. దీనికి వీసీ నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సులో గతేడాది అడ్మిషన్ల విషయంలో గందర గోళంగా వ్యవహరించారని, ఈఏడాది కూడా నర్సింగ్ అడ్మిషన్లపై స్పష్టత ఇవ్వటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి పదేళ్లుగా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న పాత వీసీని మార్చి కొత్త వీసీని ఎప్పుడు నియమిస్తారనే చర్చ వైద్య ఆరోగ్య శాఖలో జోరుగా జరుగుతున్నా ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందా అని ఎదురుచూస్తున్నారు.



బ్యారేజీలో బోట్‌పై ఏడీసీపీ సర్వే నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

## మేడిగడ్డ బ్యారేజీలో ఏడీసీపీ సర్వే

- ప్రవాహ తీరును రికార్డు చేయనున్న శాస్త్రవేత్తలు
- మరో మూడు రోజులు కొనసాగనున్న అధ్యయనం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 11 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీలో నీటి ప్రవాహ వేగాన్ని తెలుసుకునేందుకు అకాస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్ (ఏడీసీపీ) సర్వే బుధవారం నిర్వహించారు. పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) శాస్త్రవేత్త సంపత్ కుమార్ నేతృత్వంలోని నలుగురు బృందం సభ్యులు పవర్ బోట్‌లో తిరుగుతూ పరిశీలించారు. బ్యారేజీకి ఎగువ, దిగువ ప్రవాహ బ్లాకుల్లో ప్రవాహ తీవ్రతను అధ్యయనం చేశారు. ఇది ఇంకా రెండు, మూడు రోజులుగా కొనసాగనుంది. గోదావరిలో ప్రవాహ తీవ్రత ఎక్కడ ఏవిధంగా ఉందో శాస్త్రవేత్తలు గుర్తించనున్నారు.దీన్ని బట్టి ప్రవాహ తీవ్రతకు బ్యారేజీ సామర్థ్యం సరిపోతుందా.. లేదా? అనేది నిర్ధారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రెండు వారాల క్రితమే ఈసర్వే నిర్వహించాల్సి ఉండగా పవర్ బోట్ అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమైనట్లు సమాచారం. నాటు పడవలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సర్వేను వాయిదా వేశారు. పవర్ బోట్ అందుబాటులోకి రావడంతో సర్వేను బుధవారం ప్రారంభించారు. సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తల వెంట ఈఈ తిరుపతి రావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

## ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

- మార్కెటింగ్ శాఖ జేడీ ఉప్పుల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ఉప్పుల శ్రీనివాస్

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 11: మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మరికొద్ది రోజుల్లో కాటన్ సీజన్ ప్రారంభం కాబోతున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యార్డులలో మౌలిక సదుపాయలు కల్పించి తాగు నీరు, లైటింగ్, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేయింగ్ మిషన్స్ సరి చేయించుకోవాలని, ఖరీదుదారుల నుంచి ప్రతీ నెల కొనుగోలు నివేదికలు తీసుకుంటూ మార్కెట్ ఫీజు ఎప్పటికప్పుడు వసూలు చేయాలని ఆదేశించారు. మార్కెట్లను ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు ఏదైనా తేడా వస్తే దానికి మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల, ఉమ్మడివరంగల్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌ల కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'గోమయం' గణపయ్య..

- ఆవుపేడ, గోపంచకం, పసుపుతో విగ్రహం
- నవరాత్రుల్లో ఎనిమిదేళ్లుగా ఇదే ప్రత్యేకత



గోమయం వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న శ్రీమహాలక్ష్మీగణపతి సేవా ట్రస్టు బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 11: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీమహాలక్ష్మీ గణపతి సేవాట్రస్టు ఆధ్వర్యంలో తొలుత మట్టివిగ్రహాలను పూజించారు. ఆ తర్వాత మరో అడుగు ముందుకేసి.. ఎనిమిదేళ్లుగా 'గోమయం' వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఎస్వీ. నాగేశ్వర్‌రావు, సోమ శ్రీనివాస్, శ్రీరంగం రామారావు, సోమ రాంబాబు ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో శ్రీమహాలక్ష్మీ గణపతి సేవా ట్రస్టును స్థాపించారు. పర్యావరణ పరిరక్షణే నినాదంగా ఈ ట్రస్టు వారు గోమయం (ఆవుపేడ), గోపంచకం, చింతగింజల పొడి, వేపాకు పేస్టు, పసుపుతో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తయారు చేసిన గోమయం విగ్రహాన్ని కొనుగోలు చేసి తీసుకొచ్చి మహబూబాబాద్‌లో ప్రతిష్ఠించి నవరాత్రులు పూజలు చేస్తున్నారు. ఈ గోమయం విగ్రహం ద్వారా పర్యావరణానికి మేలుజరుగుతుందని, చెరువులో నిమజ్జనం చేశాక త్వరితగతిన కరిగిపోవడంతో పాటు ఆవుపేడ, గోపంచకం, వేపాకు పేస్ట్, పసుపు, చింతగింజల పొడి నీటిలో కలిసి క్రిమికీటాకాలు నశించిపోతాయని పర్యావరణ నిపుణులు, ప్రేమికులు చెబుతున్నారు. అంతేకాదు ఈ వినాయక విగ్రహం వద్ద నిత్యం కాళేశ్వరం నుంచి ప్రత్యేకంగా తీసుకవచ్చిన గంగాజలంతో పాటు 21రకాల అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

## తేలుతున్న కబ్జాల లెక్క

పకడ్బందీగా కేయూ భూముల సర్వే



బీసీ కాలనీలోని రోడ్డు వద్ద మార్కింగ్ చేస్తున్న అధికారులు

- రెండో రోజు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ భూ సర్వే
- కూల్చివేతలకు సిద్ధమవుతున్న అధికారులు
- వర్సిటీ భూ కబ్జాదారుల గుండెల్లో రైళ్లు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 11: కాకతీయ యూనివర్సిటీ భూ కబ్జాలు, ఆక్రమణలపై రోజు రోజుకూ కొత్త విషయాలు బహిర్గతమవుతాయి. రెండు రోజులుగా వర్సిటీలోని భూ కబ్జాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బృందం నేతృత్వంలో పకడ్బందీగా సర్వేలకు దిగారు. ఈ సర్వేతో గతంలో వర్సిటీ అధికారులు చేసిన డిజిటల్ సర్వే, గూగుల్ మ్యాపులను మించి అధికంగా వర్సిటీ భూములు కబ్జాలకు గురైనట్లు తాజాగా చేపట్టిన సర్వేలతో రూఢీ అవుతోంది. దీంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇన్ని రోజులు వర్సిటీ భూమిని దర్జాగా అనుభవిస్తున్న కబ్జాదారులు.. ఇప్పటి తాజా సర్వేలతో బెంబేలెత్తుతున్నారు.

### బీసీ కాలనీలో..

వర్సిటీ క్యాంపస్‌లోని న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ పక్కన 229 సర్వేనెంబర్‌లో బుధవారం అధికారుల బృందం సర్వే నిర్వహించారు. ఇందులో బీసీకాలనీలో 30మంది ఇళ్లు వర్సిటీకి చెందిన భూమిల్లోకి వచ్చినట్లు స్పష్టత వస్తోంది. వర్సిటీ భూములను గుర్తించి ఇళ్లకు మార్కింగ్ చేసి కూల్చివేతలకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ సన్నద్ధం అవుతోంది. తాజా సర్వేతో బీసీ కాలనీలోని అంతర్గత రోడ్డుతో పాటు డెడ్ ఎండ్ సైతం వర్సిటీ భూమిలోనే ఉందని స్పష్టతరాగా, వెంటనే అధికారులు ఆయా స్థలాల్లో అధికారులు మార్కింగ్ చేశారు. అలాగే బీసీకాలనీలోని రోడ్డు సైతం వర్సిటీ భూమిలో ఉండటంతో ఏంచేయాలనే ఆలోచనలో పడ్డారు. సర్వే అనంతరం హనుమకొండ రెవెన్యూ సర్వేయర్ రాజేశ్ నేతృత్వంలో మార్కింగ్ చేసి భూ పంచనామా చేశారు. తర్వాత కూల్చి వేతలకు చేపడుతామని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం నుంచి 214లో సర్వే నెంబర్‌లో సర్వే చేపట్టనున్నారు. అంతకుముందే అయా స్థలాల్లో కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడ్డ వారికి నోటీసులు జారీ చేస్తామని మనిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు వర్సిటీలో ని మరో 6 సర్వే నెంబర్లలోనూ భూసర్వే చేపట్టిన తర్వాత వర్సిటీ భూమిపై పూర్తి స్పష్టత వస్తుందని జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ భావిస్తోంది.

### వర్సిటీ మాజీలకు బిగుస్తున్న ఉచ్చు

కాకతీయ యూనివర్సిటీలో తాజా పరిణామాలను గమనిస్తే వర్సిటీ తాజా మాజీల చుట్టూ ఉచ్చు బిగుస్తోందని తెలుస్తోంది. అప్పటి బీఆర్ఎస్ అధికార పార్టీ ఎమ్మెల్సీ, ఇప్పటి ఎమ్మెల్యే ప్రోద్బలంతో తాజా మాజీలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. తామేమి చేసినా ఏం కాదనే అహంకారంతో వ్యవహరించారనే చర్చ సాగుతోంది. అలాగే వర్సిటీ అధ్యాపకుల సంఘం (అకూట్) జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారీ, ఇతర విద్యార్థి సంఘాల నేతలు వర్సిటీలో జరిగిన అవినీతి అక్రమణలు, అధికార దుర్వినియోగంపై స్పష్టమైన ఆధారాలతో రాష్ట్రప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అవినీతి ఆరోపణలతోపాటు ఇతర విషయాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో తాజా మాజీ వీసీపై వచ్చిన భూ కబ్జాలు, కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లు అక్రమాలు, అడ్జంట్ ప్రొఫెసర్ల నియామకాలు, న్యాక్ అభివృద్ధి పనుల పేరుతో అందినకాడిన దోచుకున్న తీరు, తెలుగు తది తర విభాగాల్లో అక్రమంగా పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలు, తనకు అనుకూలమైన డీన్లు, ఇతర ఏ ఆర్‌లను ప్రధాన విభాగాల్లో నియమించుకుని డబ్బుల వసూళ్లకు పాల్పడిన తీరుపై విజిలెన్స్ డేగకన్నును వే సింది. వర్సిటీలోని ఆడిట్ కార్యాలయంలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులు హాస్టల్ కాంట్రాక్టర్ వద్ద నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడగా పట్టుకున్నారు. అప్పట్లో ఈ విషయంలో వర్సిటీతోపాటు రాష్ట్ర వ్యాప్తం గా సంచలనంగా మారింది.

వీటన్నింటితోపాటు ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కబ్జాల స్థలంలో ఇల్లు నిర్మించుకోవడమే కాకుండా, అత్యున్నత పాలక మండలి నేతృత్వం వహించిన భూకమిటీలోనూ పనిచేసి తన ప్రాబల్యాన్ని చూపించారనే ఫిర్యాదులు న్నాయి. వీటన్నింటినీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్, ఎస్సై రాజేశ్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. వర్సిటీ నిబంధనలు ఏమి చెబుతున్నాయి..? రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ఎలా ఉన్నాయి..? వర్సిటీలో ఏమి జరిగింది? ఏ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేశారనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అడ్జంట్ ప్రొఫెసర్ల నియామకాలపై వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే విజిలెన్స్ అధికారులకు అడ్జంట్ ఫ్యాకల్టీగా పనిచేసిన ప్రొఫెసర్లంతా ప్రత్యేకంగా విజిలెన్స్ అధికారులను కలిసి తమ వాదనలతో కూడిన అఫిడవిట్లు సమర్పించారు.

ఒక్కొక్క ఆరోపణలు రోజు రోజుకూ నిజ మని రూఢీ అవుతుండంగా, వర్సిటీలోని అక్రమాలకు బాధ్యులైన మాజీ బాస్‌లకు ఉచ్చు బిగుస్తోందనే విషయం బహిరంగ చర్చకు దారి తీస్తోంది. వర్సిటీ భూ కబ్జాలతో పాటు ఇతర అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం తదితర వివాదాస్పద అంశాలన్నీ తాజాగా వర్సిటీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నెహ్రూసెంటర్ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 11 : మహబూబాబాద్ మెడికల్ కళాశాలలో ఖాళీగాఉన్న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆధ్యాపక పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ప్రభుత్వ వైద్య కళాశాలలో వాక్ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిన పోస్టులను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ 5 పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్ 7, అసిస్టెంట్ ప్రొఫెసర్ 19, సీనియర్ రెసిడెన్స్ 49, ట్యూటర్ 26 పోస్టులు ఉన్నాయన్నారు. అసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత అర్హత సర్టిఫికెట్లు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్, ఒరిజినల్స్ తీసుకుని ప్రభుత్వ వైద్య కళాశాల మహబూబాబాద్‌కు హాజరు కావాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 69 ఏళ్ల కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్ http://gmcmahabubabad.org. నోటిఫికేషన్ దరఖాస్తులు పొందవచ్చని తెలిపారు

## వరంగల్ జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్‌గా రవి



వరంగల్ లీగల్, సెప్టెంబరు 11: వరంగల్ జిల్లా ప్రధాన కోర్టు ప్రభుత్వ న్యాయవాది (గవర్నమెంట్ ప్లీడర్)గా న్యాయవాది పోతరాజు రవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పదవిలో ఆయన ఆరు నెలల పాటు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. 20 ఏళ్ల నుంచి జిల్లాకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

## గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 11: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండిబజార్ వద్ద పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. సీఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం శాయంపేటకు చెందిన షేక్ రషీదా మండిబజార్ వద్ద బిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. బిక్షాటనతో కుటుంబ అవసరాలు తీరడంలేదని.. సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించింది. బల్లార్షా వెళ్లి అరకిలో గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చింది. చిన్న చిన్న ప్యాకెట్లు చేసి మండిబజార్ ప్రాంతంలో విక్రయిస్తోంది. బుధవారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు రషీదా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని చూడగా గంజాయి లభించింది. నిందితురాలి నుంచి 250 గ్రాముల గంజాయి, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు. గంజాయి విక్రయించిన వారిపై సేవించిన వారిపై కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

## ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న మాల మహానాడు, అంబేద్కర్ సంఘం నేతలు

వడ్డెపల్లి, సెప్టెంబరు 11: ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీఎస్పీ, అంబేద్కర్ సంఘం, ఆర్‌పీఐ, సమాజ్‌వాది పార్టీ, లోక్‌జనశక్తి, సమత సైనిక్‌దళ్‌తో పాటు గిరిజన పార్లమెంటు సభ్యులు చేస్తున్న దర్నాకు సంఘీభావంగా బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు.

ఈ సందర్భంగా మన్నె బాబురావు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామితో పాటు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దావ రవి, జిల్లా ఉపాధ్యక్షుడు పనికెల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కులాలను వర్గీ కరణ చేసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ని పరిగణలోకి తీసుకోకుండా ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీల మధ్య విబేధాలు సృష్టించేదిగా ఉందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో మాల మహానాడు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు బండి అశోక్, సింగారపు రవిప్రసాద్, బొల్లం రాంకుమార్, ఉసిల్ల ఉదయ్, గొర్రె రమేష్, సాదు కుమార స్వామి, దండ్ర శ్రీనివాస్, కొరివి అనిల్, మల్లం రాజ్‌కుమార్, నర్సయ్య, సురాసి విక్రమ్, పరశురాములు, పోతురాజు ప్రభాకర్, రామన్న, జగపతి, హరీష్, కూనమల్ల రవి, దండు రవి పాల్గొన్నారు.

## మడికొండ క్వాడ్రంట్ కంపెనీలో వాక్ ఇన్ డ్రైవ్

ఐటీలో యువతకు ఉపాధి అవకాశాలు

మడికొండ, సెప్టెంబరు 11: మడికొండ ఐటీ సెజ్‌లోని క్వాడ్రంట్ ఐటీ కంపెనీలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా వాక్ ఇన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు క్వాడ్రంట్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 22, 23, 24 సంవత్సరాల్లో ఎంబీఏ, బీబీఏ, బీటెక్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 13న క్వాడ్రంట్ కంపెనీలో జరిగే వాక్ ఇన్ డ్రైవ్‌లో ఉపాధి అవకాశాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇన్సైడ్ సేల్స్, ప్రీ సేల్స్ ప్రొడక్ట్ ఆఫ్ టెక్నాలజీ సేల్స్ అవకాశాలు ఉన్నాయన్నారు. డే షిఫ్ట్‌లో వర్క్ ఉంటుందన్నారు. గుడ్ కమ్యూనికేషన్ స్కిల్స్ మార్కెటింగ్, కోల్డ్ కాలింగ్, సేల్స్ ప్రాసెస్ నాలెడ్జి, దృఢమైన లీడర్‌షిప్ స్కిల్స్ ఉన్నవారికి అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆసక్తి గల యువత శుక్రవారం ఉదయం 10.30 గంటలకు క్వాడ్రంట్ ఐటీ సెజ్‌లో నిర్వహించే వాక్ ఇన్ డ్రైవ్‌కు హాజరుకావాలని మురళీధర్ రెడ్డి కోరారు.

## మావోయిస్టు దళ సభ్యురాలి లొంగుబాటు



మావోయిస్టు లొంగుబాటును చూపుతున్న ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు11: మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీసులు ఎదుట బుధవారం రాత్రి లొంగిపోయింది. ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ విలేకరుల సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పూజారి కాంకేర్ ఏరియా దళ సభ్యురాలు (ఏసీఎం) పోడియం సోమిడి అలియాస్ రీని మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక పార్టీ నుంచి బయటకు వచ్చి లొంగిపోయిందని తెలిపారు. పూజారి కాంకేర్ ఆర్పీసీ కమాండర్ కుర్సం సమ్మయ్య అలి యాస్ సమ్మన్న ప్రోద్బలంతో సోమిడి 2019లో మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యురాలిగా చేరిందన్నారు. ఆ తర్వాత ఆయన దగ్గర ఆరు నెలలు పనిచేసిందని, అనంతరం రెండో సెంట్రల్ రీజినల్ కమాండర్ దొడ్డి పోజ్జ అలియాస్ ప్రకాశ్ ఆమెకు పార్టీ సభ్యురాలిగా పదోన్నతి కల్పించాడని వివరిం చారు. అక్కడ ఆమె దళకమాండర్ సాగర్‌కు గార్డుగా యేడాది పాటు పనిచేసిందని, ఆ తర్వాత సెంట్రల్ రీజినల్ ఒకటో ప్లాటూన్‌లో చేరిందని వివరిచారు. 2023లో ఆమె ఏరియా కమిటీ సభ్యురాలుగా హోదా పొందిందన్నారు. సోమిడిపై రూ.4 లక్షల రివార్డ్ ఉందని ఏఎస్పీ తెలిపారు. ఆయా హోదాల్లో పనిచేసి నపుడు పలు హింసాత్మక సంఘట నలు సహా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కర్రె గుట్టల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆమె పాల్గొందని తెలిపారు. ఆ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని అన్నారు. అదేవిధంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగురగొండ పీఎస్ పరిధిలోని కుందేర్ గ్రామంలో ముగ్గురు సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లను కాల్చి చంపిన సంఘటనలో సోమిడి పాల్గొందని ఏఎస్పీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ధర్మారం క్యాంపుపై జరిగిన దాడిలో ఆమె పాల్గొంద న్నారు. అదే రాష్ట్రం పెద్దబట్టులోని కవుర గుట్టలో జరిగిన పోలీసుల కాల్పుల్లో తప్పించుకుందని వివరించారు. మావోయిస్టు పార్టీ భావజాలంపై విరక్తితో సోమిడి బయటకు వచ్చిందన్నారు.

మావోయిస్టులు ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి ముఖ్య నేతలకు పంచే విధానం నచ్చక ఆమె పార్టీని వీడి జన జీవన స్రవంతి కలుస్తోందని ఏఎస్పీ తెలిపారు.

# ఎత్తయిన ప్రదేశంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

● కేంద్ర బృందానికి ముల్కలపల్లి వాసుల మొర



ఆకేరు వరదముంపుతో దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్రబృందం సభ్యులు, కలెక్టర్

డోర్నకల్, సెప్టెంబరు 11 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద ఆకేరు వాగుకు వరద పోటెత్తడంతో ముల్కలపల్లిలో భారీ ఆస్తినష్టం సంభవించింది. నష్టం వివరాలు తెలుసుకునేందుకు బుధవారం రాత్రి క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు వచ్చిన కేంద్రబృందం అధికారులు వరదకు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. ముల్కలపల్లిలోని ఎస్సీ కాలనీని సందర్శించి, బాధితులతో మాట్లాడారు. తమకు ఎత్తయిన ప్రదేశంలో ప్రభుత్వం తరుపున ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బాధితులు మొర పెట్టుకున్నారు. వచ్చిన వరదకు ఇంటిలోకి ఎంతమేర నీరు వచ్చిందని కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరదకు కొట్టుకుపోయిన హైలెవల్ వంతెనను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో కేంద్రప్రభుత్వానికి అందిస్తామని వారు తెలిపారు. బృందంలో కల్నల్ కెపి. సింగ్, మహేష్‌కుమార్, శాంతినాథ్ శివప్ప కాగి, ఎస్‌కె కుష్వాహ, టి.నిలయకన్నన్, డాక్టర్ శశివర్ధన్, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, ఆర్అండ్‌బీ సీఈ నాగేందర్‌రావు, సురేంద్ర మోహన్, ఉన్నారు. వారి వెంట జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్ పాల్గొన్నారు.

# గోడును వింటూ.. నష్టాన్ని పరిశీలిస్తూ..

(5వ పేజీ తరువాయి)

కేంద్ర బృందం సభ్యులు చలించిపోయారు. 8వ తరగతి చదువుతున్న గాయత్రి, ఇంటర్ చదువుతున్న సోనాలిక వారికి భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. మరో కేంద్ర బృందం అబ్బాయిపాలెం, గాలివారిగూడెం, పురుషోత్తమయగూడెం రోడ్ల డ్యామేజీలను పరిశీలించారు. వీరికి అర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు నష్ట అంచనాలను వివరించారు. కేంద్ర తనిఖీ బృం దంలో కల్నల్ కెపి.సింగ్, మహేష్‌కుమార్, శాంతినాథ్ శివప్ప కాగి, ఎస్‌కె కుష్వాహ, టి.నిలయకన్నన్, డాక్టర్ శశివర్ధన్, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్, ఆర్అండ్‌బీ సీఈ నాగేందర్‌రావు, సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, తొర్రూరు ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



పంటనష్టంపై జీచరాజపల్లి గ్రామరైతుల ప్లకార్డుల ప్రదర్శన



ముల్కలపల్లిలోని ఎస్సీ కాలనీలో మహిళతో మాట్లాడుతున్న కేంద్రబృందం



ఉల్లేపల్లిలో ముంపునకు గురైన పంటచేన్లను పరిశీలిస్తున్న కేంద్రబృందం

## విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్**

బయ్యారం, సెప్టెంబరు 11 : విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ ఆదేశించారు. బుధవారం బయ్యారం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థుల సామర్థ్యాలను డీఈవో రాబట్టారు. అంతకు ముందు పాఠశాల రికార్డులను పరిశీలించి, సమీక్ష నిర్వహించారు. వచ్చే ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించేలా పనిచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎంఈవో పూల్‌చంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముల్కలపల్లి బ్రిడ్జిమీదుగా రాకపోకలు షురూ



ముల్కలపల్లి వద్ద లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న వాహనాలు

డోర్నకల్, సెప్టెంబరు 11 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారి 365/ఏ మీద ఉన్న ముల్కలపల్లి హైలెవల్ బ్రిడ్జి ఆకేరు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో మహబూబాబాద్ వయా కురవి మీదుగా ఖమ్మంకు రాకపోకలు నిలిచిపోయాయి. హైలెవల్ బ్రిడ్జిపక్కనే ఉన్న పాత లోలెవల్ బ్రిడ్జి వరదకు చెక్కు చెదరకపోవడంతో తాత్కాలికంగా ఆ బ్రిడ్జిపై నుంచి మహబూబాబాద్ వయా కురవి మీదుగా ఖమ్మంకు రాకపోకలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులు పదిరోజులుగా బ్రిడ్జి డైవర్షన్ పనులు చేపట్టారు. పనులు పూర్తికావడంతో వాహన రాకపోకలు ప్రారంభమయ్యాయి.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నెల్లికుదురు, సెప్టెంబరు 11 : ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మునిగలవీడులో బుధవారం రాత్రి జరిగింది. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. ధర్మారపు ఎల్లయ్య (30) తాగుడుకు బానిసై జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య మమత ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నాడు.



# ఘనంగా అటవీశాఖ అమరవీరుల దినోత్సవం

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 11 : జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్‌లో బుధవారం అటవీ అమరవీరుల దినోత్సవాన్ని జిల్లా అటవీశాఖ అధికారి బత్తుల విశాల్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈసందర్భంగా మహబూబాబాద్ పట్టణంలోని ఎఫ్ఆర్వో సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అటవీ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జమాండ్లపల్లిలోని అటవీశాఖ జిల్లా కార్యాలయంలో విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరులకు అధికారులు, సిబ్బంది నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్లు జోత్స్నదేవి, రేణుక, డీఆర్‌వోలు నాగరాజు, సురేష్, సెక్షన్ ఆఫీసర్ గౌస్, మంగారావు, నవీన్, బీట్ ఆఫీసర్లు చంద్రయ్య పాల్గొన్నారు.

● గూడూరు : అటవీ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్ కొనియాడారు. అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా గూడూరులో ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో మృతి చెందిన అటవీశాఖ అమరవీరులకు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులు జాతీయ సంపద అన్నారు. చెట్లను నాటడం, వాటి పరిరక్షించుకోవాలన్నారు. పర్యావరణంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రేంజ్ అధికారి సురేష్, డీఆర్వో మాధవి, సెక్షన్, బీట్ అధికారులు శ్రీనివాస్, శ్రీధర్, విక్రమ్, వెంకటేశ్వర్లు, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడికి పుష్‌పుల్ రైలులో గుండెపోటు

● ట్రైన్‌లోనే సీపీఆర్ చేసి, ప్రాణాలు కాపాడిన వైద్యుడు యుగంధర్



గుండెపోటుకు గురైన భద్రాసింగ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11 : దేవుడు జన్మనిస్తే.. వైద్యుడు పునఃర్జన్మనిస్తాడనేది అక్షర సత్యం. దీనికి ఈ సంఘటనే ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. రైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి గుండెపోటు రాగా ఓ వైద్యుడు సీపీఆర్ చేసి అతడికి ప్రాణాలు పోసి ప్రశంసలు పొందాడు. ఈ ఘటన ఇంటికన్నె సమీపంలో జరిగింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు లావుడ్యా భద్రాసింగ్ వరంగల్‌లో నివాసం ఉంటూ రోజూ రాకపోకలు సాగిస్తున్నాడు. రోజులాగానే బుధవారం ఉదయం వరంగల్ నుంచి పుష్‌పుల్ రైలులో కేసముద్రం బయలు దేరాడు. రైలు ఇంటికన్నె సమీపంలోకి వచ్చిన సమయంలో భద్రాసింగ్‌కు గుండెపోటు రాగా, అదే బోగిలో ప్రయాణిస్తున్న మానుకోట జిల్లా ప్రభుత్వ అనస్థీషియన్ డాక్టర్ యుగంధర్ ఆ ఉపాధ్యాయుడికి సీపీఆర్ చేసి, ప్రాణాలను కాపాడారు. భద్రాసింగ్ వెంటఉన్న మరో ఉపాధ్యాయుడు ఈ విషయాన్ని మహబూబాబాద్‌లోని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి లింగంపల్లి దయానంద్‌కు చేరవేశాడు. వెంటనే జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ వెంకట్రాములుకు సమాచారం అందించారు.

మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో భద్రాసింగ్‌ను దింపి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించి, ప్రాథ మిక వైద్యం అందించాక మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం భద్రాసింగ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, భద్రాసింగ్ ప్రాణాలను కాపా డిన యుగంధర్‌ను తోటి వైద్యులు, ప్రజలు అభినందించారు. ఈ క్రమంలో యుగంధర్‌ను జిల్లా ఆస్పత్రిలోని ప్రొఫెసర్లు సునీల్, శ్రావణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంతోష్, రాజశేఖర్, శిరీష్ సన్మానించారు.



రాష్ట్రస్థాయికి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డోలి సత్యనారాయణ, రిటైర్డ్ సీఐ అంబటి రవీందర్

## 'క్రీడారంగంలో అగ్రస్థానంలో నిలపాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11 : జిల్లాను క్రీడారంగంలో అగ్రస్థానంలో నిలపాలని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, రిటైర్డ్ సీఐ అంబటి రవీందర్ సూచించారు. మానుకోట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జూనియర్స్ బేస్‌బాల్ పోటీల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానుకోట ప్రాంతం నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదిగారని పేర్కొన్నారు. మనదేశంలో ఒలంపిక్స్‌లో ఎక్కువ పతకాలు సాధించలేకపోతున్నారని, అందుకు కారణం నిరంతర సాధనలేకపోవట మేనన్నారు. నిర్మల్‌లో ఈనెల 14, 15,16 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి, మహబూబాబాద్ జిల్లాకు పేరు తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బేస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల సంజీవరావు, కల్లూరి ప్రభాకర్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా బాధ్యులు సమ్మెట ప్రేమ్ కుమార్, పద్మావతి, శంకర్‌నాయక్, పీఈటీ సురేష్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల ఫీజు గడువు పెంపు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11 : జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు ఈనెల 30 వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, కో-ఆర్డినేటర్ హతిరాంనాయక్ బుధవారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు www.braouonline.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకొని కళాశాల సెంటర్‌లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకొని, ఫీజు చెల్లించాలని సూచించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజు ఈనెల 20 వరకు చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 73829 29705ను సంప్రదించాలన్నారు.

## అమరుల ఆశయ సాధన కోసం పోరాడుదాం

● సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 11 : తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన అమరుల ఆశయసాధన కోసం పోరాడుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మొదటి రోజు తొర్రూరు మండలం అమ్మాపురంలో తమ్మెర వెంకటరామనర్సయ్య స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి విజయసారథి మాట్లాడుతూ నాటి ఉద్యమంలో ఈ ప్రాంతానికి చెందిన కొండపల్లి గోపాలరావు నాయకత్వంలో గూడెల్లి ఎల్లయ్య, డొనక రాములు, గుంటుక అయిలయ్య, కొత్తూరు నర్సయ్య, రామిరెడ్డి, వల్లపు కొమురెల్లి, మొగుళ్ల మల్లయ్య, వెంకటయ్య ఎంతో మంది అమరులైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ భిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు లక్ష్మణ్, డీహెచ్‌పీఎస్ నాయకుడు గూడెల్లి ఎల్లయ్య, గ్రామ కార్యదర్శి బూరుగు యాదగిరి, ఎల్లయ్య, రమేష్, కోటగిరి ఏకాంతం తదితరులు పాల్గొన్నారు.

## బైకు, బొలెరో ఢీ : ఒకరు మృతి

పెద్దవంగర, సెప్టెంబరు 11 : బొలెరో వాహనం బైకును ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఉప్పరగూడెం గ్రామశివారులో మంగళవారం రాత్రి జరిగింది. బుధవారం ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం. ఉప్పరగూడెం గ్రామానికి చెందిన శ్రీరాంవెంకన్న పనుల నిమిత్తం తన బైకుపై పెద్దవంగర మండలకేంద్రానికి వెళ్లితిరిగి స్వగ్రామమైన ఉప్పరగూడెం వెళ్తున్నాడు. ఉప్పరగూడెం నుంచి పెద్దవంగరకు వస్తున్న వల్లపు యాకయ్యకు చెందిన బొలెరో వాహనం బైకును ఢీ కొట్టడంతో శ్రీరాంవెంకన్న (51) తలకు బలమైన గా యం కావడంతో, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య శ్రీరాం శోభ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహానికి శవపంచనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

## మహిళా మృతి కేసు నమోదు

బయ్యారం, సెప్టెంబరు 11 : మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వృద్ధ మహిళా శవమై కనిపించగా బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. గంధంపల్లి శివారు సింగారం-2 కాలనీకి చెందిన షేక్ జాహిద (62) అవివాహరాలు కావడంతో అహ్మద్‌అనే వ్యక్తిని సాదుకుంది. కొంత కాలానికి నజియా అనే మహిళతో అహ్మద్ వివాహం జరిపించింది. మూడురోజుల క్రితం ఈనెల 8వ తేదీన అహ్మద్ కోడలు నజియ కుటుంబసమస్యల విషయంలో గొడవ పడ్డారు. గమనించిన జాహిద విడిపించేందుకు ప్రయత్నించింది. దీంతో కోడలు నజియా మేము గొడవ పడితే నీకేం అవసరం.. నువ్వు ఎందుకు మధ్యలో దూరుతున్నావంటూ అత్త జాహిదను ప్రశ్నించింది. కోడలు మందలించిందనే మనస్తాపమో.. లేక మరే ఇతర కారణమో తెలియదు కాని ఈనెల 8న ఇంటి నుంచి వెళ్లిపోయిన జాహిద బుధవారం అలిగేరు బ్రిడ్జి సమీప శ్మశాన వాటికలో శవమై కనిపించింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా, జిల్లా ఆస్పత్రిలో మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

## గణపయ్య సన్నిధిలో అన్నదానం

నర్సింహులపేట, సెప్టెంబరు 11 : నర్సింహులపేట మండల కేంద్రంలోని చౌరస్తాలోవిఘ్నేశ్వర భక్త బృందం ఆధ్వర్యంలో బుధవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సై ఎం.సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదానం చేశారు. ఎస్సై మాట్లాడుతూ అన్నిదానాల్లోకెల్లా అన్నదానం గొప్పదన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఘ్నేశ్వర భక్త బృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, సెప్టెంబరు 11 : రాష్ట్రంలో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని రాయపర్తి, పెద్దవంగర, తొర్రూరు మండలాల 54 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పం పిణీ చేశారు. అనంతరం వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, హనుమ్యానాయక్, సురేష్, గజానంద్, బిజ్జాల అనిల్, దొంగరి శంకర్, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సంతోష్



కేసముద్రం, సెప్టెంబర్ 11 : తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా ఉపాధ్యక్షుడిగా రంగాపురం ఉపాధ్యాయుడు వేమ సంతోష్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జింజిరాల నాగరాజు, గుడిబోయిన గోపీకృష్ణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపే తానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

## బాధితులకు దుస్తుల పంపిణీ



ముల్కలపల్లిలో వరద బాధితురాలికి దుస్తులు పంపిణీ చేస్తున్న ఐఎంఏ బాధ్యులు

డోర్నకల్, సెప్టెంబరు 11 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముల్కలపల్లిలో ఆకేరు ఉధృతితో నష్టపోయిన బాధితులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో బుధవారం దుస్తులను పంపిణీ చేశారు. 200 మంది బాధిత కుటుంబాల మహిళలకు చీరలను అందించారు. ఈ సందర్భంగా ఐఎంఏ మహబూబాబాద్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ బానోత్ నెహ్రూ మాట్లాడుతూ ఆకేరువాగు ఉధృతితో ముల్కలపల్లి గ్రామంలోని ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారందరిని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రూప్‌లాల్, సురేందర్, సూర్యకుమారి, సౌజన్య, వైదేహి, కిరణ్‌నాయక్, స్వచ్ఛంద సంస్థ బాధ్యులు సంధ్య విజయ, శ్రీదేవి, మంజుల పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువుల పంపిణీ

● మాజీమంత్రి హరీష్‌రావు వితరణ

కేసముద్రం, సెప్టెంబర్ 11 : మండలంలోని అర్పనపల్లి వట్టివాగు సమీపంలో వడ్డెరకాలనీలో వరద బాధితులకు బుధవారం మాజీమంత్రి హరీష్‌రావు పంపించిన నిత్యావసర వస్తువులను మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పంపిణీ చేశారు. అనంతరం ఇదే గ్రామంలో ఇటీవలె బైక్ ప్రమాదంలో మృతి చెందిన కంచ రాజమణి కుటుంబాన్ని శంకర్‌నాయక్ పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, నీలం దుర్గేష్, గందసిరి సోమయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ.నజీర్‌అహ్మద్, కముటం శ్రీను, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, గుగులోత్ వీరునాయక్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా వినాయక నిమజ్జనం జరుపుకోవాలి

● మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న

డోర్నకల్, సెప్టెంబరు11 : గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని చివరిరోజు జరిగే వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని డోర్నకల్ మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, సీఐ రాజేష్, మునిసిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు డోర్నకల్ శివారులో ఉన్న బతుకమ్మ చెరువులో విగ్రహాల నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక నిమజ్జనంలో పోలీస్‌శాఖ, మునిసిపల్ శాఖలు వినాయక నిమజ్జనానికి పూర్తిసహకారం అందించున్నట్లు చెప్పారు. మునిసిపల్ వైస్ చైర్మన్ కె.కోటిలింగం, కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ భద్రునాయక్, బడేటి శ్రీనివాస్ ఉన్నారు.

## నష్టపోయిన పంటల పరిశీలన

మహబూబాబాద్ అగ్రికల్చర్,సెప్టెంబరు 11 : భారీ వరదల మూలంగా పంటలు నష్టపోయిన మరిపెడ మండలం ఉల్లెపల్లి, సీతారాంపురంతండలో బుధవారం పంటలను పరిశీలించినట్లు జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల తెలిపారు. కొట్టుకుపోయిన పత్తి, పొలాలను, వివిధ పంటల్లో వేసిన ఇసుక మేటలను అధికారులు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటలను ప్రత్యక్షంగా పరిశీలించి నష్టం వేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి వివరించారు. ఆమెవెంట జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న, మరిపెడ ఏడీఏ విజయచందర్, మండల వ్యవసాయాధికారి వీరాసింగ్ పాల్గొన్నారు.

## 'జంగాలకుంట కట్టను బాగు చేయాలి'

కురవి, సెప్టెంబరు 11 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాకులబోడు తండా జీపీ పరిధిలోని జంగాలకుంట కట్ట తెగిపోయింది. తెగిన కుంటను డోర్నకల్‌మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం తక్షణమే కుంటకు మరమ్మతు చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, గుగులోతు రవినాయక్, గుండోజు శ్రీను, కుదురుపాక చుక్కయ్య, గుగులోతు కిషన్, రవీందర్, సందీప్, లింగన్న, బిక్షపతి, సురేష్, భద్రు పాల్గొన్నారు.

## నర్సింహారావుకు గణితంలో డాక్టరేట్



మరిపెడ, సెప్టెంబరు 11 : మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెం ట్ ప్రొఫెసర్ కందుల నర్సింహారావు కేయూ డాక్టరేట్ పొందారు. ఆయన ఖమ్మం జిల్లా వి.వెంకటాయపాలెంకు చెందిన వారు. మరిపెడ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 'థీసిస్ స్టడీ ఆఫ్ డిస్పరీవ్ బిహేవియర్ ఆఫ్ వేవ్స్ అండ్ వైబ్రేషన్స్ ఇన్ డిఫరెంట్ ఎలాస్టిక్ సాలిడ్స్' అనే అంశంపై పరిశోధనలు చేశారు. పీహెచ్‌డీ పట్టా రావడంపై నర్సింహారావును ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## జీపీ సిబ్బంది వేతనాలు విడుదల చేయాలి

కొత్తగూడ, సెప్టెంబరు 11 : పెండింగ్‌లో ఉన్న జీపీ సిబ్బంది వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కొత్తగూడ, గంగారం సంయుక్త మండలాలసహాయ కార్యదర్శి ల్యాదెళ్ల రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు కొత్తగూడలోని ఎంపీడీవో కార్యలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. జీపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు చింత యాకయ్య, కార్యదర్శి మిడతపల్లి రవి, ఇఫ్టూ నాయకులు కంగాల పాపయ్య, సుమంత్, ప్రకాష్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి మహిళ మృతి

గార్ల సెప్టెంబర్ 11 : కొత్తతండాలో బుధవారం ఉతికిన బట్టలు ఆరవేస్తుండగా, ఇనుప తీగకు కరెంట్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్ గురై దరావత్ లలిత (32) అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. లలిత ఉదయాన్నే బట్టలు ఉతికి ఇంటి ఆవరణలో ఉన్న దండెం తీగకు ఆరవేసే సమయంలో చేతికి కరెంటు షాక్ కొట్టడంతో లలిత కేకలు వేస్తూ కిందపడిపోయి అక్కడికక్కడే మృత్యువాత పడింది. మృతురాలుకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త రమేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై జీనత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నల్లబెల్లం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 11 : గుడుంబా తయారీకి నల్లబెల్లం అక్రమంగా సరఫరా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని రవాణాకు ఉపయోగించిన కారు, రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్ సీఐ సీహెచ్.నీరజ, ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి తెలిపారు. ఇల్లందు రోడ్, రైల్వేస్టేషన్, కురవి గేట్, సాలార్‌తండా ఏరియాల్లో బుధవారం తెల్లవారుజామున రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన కారు, రెండు ద్విచక్రవాహనాలను తనిఖీ చేయగా వాటిలో 450 కిలోల నల్లబెల్లం, 150 కిలోల పటిక, 41 లీటర్ల గుడుంబాను గుర్తించినట్లు చెప్పారు. నెల్లికుదురు మండలం ఆలేరుకు చెందిన గుగులోతు సైదులు, మహబూబాబాద్ మండలం ఇస్లావత్‌తండాకు చెందిన ఇస్లావత్ నవీన్‌లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి నుంచి నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామానికి నల్లబెల్లం తరలిస్తున్నట్లు చెప్పారు.

## పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వీడాలి

**ఎంపీడీవో వివేక్రమ్**

దంతాలపల్లి, సెప్టెంబరు 11 : మండలంలోని 17 గ్రామ పంచాయతీలో పని చేసే కార్యదర్శులు అలసత్వం వీడాలని ఎంపీడీవో వివేక్రమ్ హెచ్చరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వార్డులో మార్పులు, చేర్పులకై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో వార్డుల వారీగా ఓటరు జాబితను సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కనీస సౌకర్యాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అప్సరపాషా, పంచాయతీ కార్యదర్శులు సిరబోయిన శ్రీనువాస్, ఏశబోయిన వెంకన్న, లక్ష్మి, అజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.